# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ మానవ హక్కులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ విపక్షాల ఆందోళనల మధ్య పార్లమెంట్ ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.
- ❖ దేశంలో పట్టణీకరణ గణనీయంగా పెరుగుతోందని కేంద్ర పట్టణ గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అన్నారు.
- ❖ రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి.
- ❖ పార్లమెంట్‌లో చర్చ సాఫీగా జరిగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వర్తమాన కాలంలో మానవ హక్కులకు కొత్త ముప్పు ఏర్పడుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరాలు, వాతావరణ మార్పుల వల్లనే ఇది సంభావిస్తోందని అన్నారు. మావన హక్కులను గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారు. జాతీయ మానవ హక్కుల సంఘం ఈరోజు న్యూఢిల్లీలో నిర్వహించిన మానవ హక్కుల దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగిస్తూ... డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు విస్తరించడంతో పాటు గోప్యతకు భంగం వాటిల్లుతోందన్నారు. భారత దేశం వేల సంవత్సరాల చరిత్రలో మానవ హక్కులను పరిరక్షిస్తూ వచ్చిందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విపక్షాల ఆందోళనల మధ్య పార్లమెంట్ ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి. గత కొన్ని రోజులుగా పార్లమెంట్ లో భారత వ్యాపారవేత్త లంచం వ్యవహారం విషయం, మణిపూర్ సంక్షోభంపై చర్చ జరగాలని ప్రతిపక్ష ఎంపీలు ఉభయ సభల్లో డిమాండ్ చేశారు. ఈ రోజు ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కొద్దిసేపటికే ఉభయసభలు వాయిదాపడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన 6 నిమిషాలకే వాయిదాపడింది. ఈ సందర్భంగా సభాపతి పార్లమెంటు గౌరవాన్ని కాపాడాలని అధికార, ప్రతిపక్ష ఎంపీలను కోరారు. మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. సభలో గందరగోళం నెలకొనడంతో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ సభను వాయిదా వేశారు. కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని పార్లమెంటు వెలుపల ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేస్తూ నిరసన చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పట్టణీకరణ గణనీయంగా పెరుగుతోందని కేంద్ర పట్టణ గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో పట్టణీకరణ 35 శాతానికి చేరుకుందని రానున్న సంవత్సరాల్లో ఇది 40 నుండి 50 శాతానికి చేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోందన్నారు. పట్టణీకరణ పెరగడంతో పాటు పట్టణ మౌలిక సదుపాయాలకు కూడా ప్రాధాన్యత పెరిగిందన్నారు. పీఎం-ఆవాస్ యోజన 2.0 కార్యక్రమం ద్వారా పట్టణ ప్రాంతాల్లో కోటి ఇళ్లను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మనోహర్ లాల్ తెలిపారు. మొదటి దశలో దాదాపు 7 లక్షల ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. త్వరలో నిర్మాణ పనులను ప్రారంభిస్తామని కేంద్రమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్‌పై ప్రతిపక్షాలు ఈ రోజు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఈ తీర్మానంపై ఇండియా కూటమి పార్టీలైన తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్ వాదీపార్టీ, డీఎంకే, ఆర్జేడీ తదితర పార్టీలకు చెందిన 50 మందికిపైగా ఎంపీలు సంతకాలు చేశారు. ఎంపీలు సంతకాలు చేసిన ఈ నోటీసులను రాజ్యసభ సెక్రటేరియట్‌కు సమర్పించారు. పార్లమెంటరీ నిబంధనలు, సంప్రదాయాల ప్రకారం సభ నడవాలని తాము కోరుకుంటున్నామని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సభలో చర్చ జరిగేలా వాతావరణం ఉండాలని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఆ దిశగా ఆలోచించాలని ఆయన కోరారు. వరసగా ఉభయ సభలు వాయిదా పడుతున్న నేపథ్యంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... పార్లమెంటరీ కార్యకలాపాలు సజావుగా సాగడం ముఖ్యమని అన్నారు. పార్లమెంటు సభ్యులు చర్చలపై దృష్టి పెట్టాలని కోరారు. అర్థవంతమైన చర్చను ప్రభుత్వం కోరుకుంటుందని ఆయన తెలిపారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు సహకరించాలని కేంద్ర మంత్రి కోరుతూ....

(వాయిస్ 35 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, మాజీ విదేశాంగ మంత్రి ఎస్.ఎం.కృష్ణ ఈరోజు మృతి చెందారు. ఆయన వయసు 92 సంవత్సరాలు. వృద్ధాప్య సమస్యలతో వ్యాధులతో గత కొంతకాలంగా చికిత్స పొందుతున్న ఆయన ఈ రోజు తెల్లవారుజామున 2 గంటల 45 నిమిషాలకు బెంగళూరులోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. 1999 నుంచి 2004 వరకు కర్ణాటక ముఖ్యమంత్రిగా, 2004 నుంచి 2008 వరకు మహారాష్ట్ర గవర్నర్‌గా ఎస్ఎం కృష్ణ పని చేశారు. 2009 నుంచి 2012 వరకు యూపీఏ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా పని చేశారు. వీటి కంటే ముందు 1989 డిసెంబర్ నుండి 1993 జనవరి వరకు కర్ణాటక విధానసభ స్పీకర్‌గా కూడా ఆయన పనిచేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా క్షయ మరణాలు 21.4 శాతం తగ్గాయని కేంద్ర ప్రభుత్వం ఈ రోజు తెలిపింది. రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ గత 8 సంవత్సరాలలో మరణాలు లక్ష జనాభాకు 28 నుండి 22కి తగ్గాయని పేర్కొన్నారు. 2015తో పోలిస్తే 2023లో దేశవ్యాప్తంగా క్షయ మరణాల సంఖ్య తగ్గిందని అన్నారు. 2015లో లక్ష జనాభాకు 237 మంది మరణిస్తే 2023 నాటికి అది 195కి తగ్గిందని అనుప్రియా పటేల్ పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధిస్తున్నామని తెలిపారు. భారతదేశాన్ని క్షయ రహితంగా మార్చడానికి కృషి సాగుతోందని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ తమిళ కవి, స్వాతంత్య్ర సమరయోధుడు సుబ్రమణ్య భారతి రచనల సంకలనాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో విడుదల చేయనున్నారు. సుబ్రమణ్య భారతి రచనలు ప్రజలలో దేశభక్తిని పెంపొందించాయి, భారతీయ సంస్కృతి యొక్క సారాంశాన్ని దేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని సాధారణ జనాల దగ్గరగా ఉండే భాషలో ప్రజలకు అందించాయి. ఆయన పూర్తి రచనల 23-వాల్యూమ్‌ల సంకలనాన్ని సీని విశ్వనాథన్ రూపొందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో గత 10 సంవత్సరాల పరిపాలనలో పారదర్శకతను పెంపొందించామని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ 16వ వార్షిక సదస్సులో మంత్రి ప్రసంగిస్తూ... 2018 నాటికే 80 శాతానికి పైగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఆన్‌లైన్ విధానంలోకి మార్చామని తెలిపారు. దీని వల్లనే ఆర్టీఐ ఫిర్యాదుల సంఖ్య పెరిగినట్లు ఆయన వెల్లడించారు. గత పదేళ్లుగా, పరిపాలనలో పారదర్శకతను పెంపొందించడమే ప్రభుత్వ విధానంగా ఉందని ఆయన వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహా కుంభమేళా 2025 జనవరి 13 నుండి ఫిబ్రవరి 26, 2025 వరకు ప్రయాగలో జరగనుంది. హిందువులు మహా కుంభమేళాను అతి పవిత్రంగా భావిస్తారు. భారతదేశంలో కుంభమేళా చరిత్ర చాలా గొప్పది. ఇది అతిపెద్ద మానవ సమ్మేళనానికి గురుతుగా ఉంటుంది. జ్యోతిషశాస్త్ర నక్షత్రాల స్థానం ప్రకారం కుంభ మేళ సమయంలో పవిత్ర నదులలో నీరు అమృతంగా మారుతుందని భక్తులు నమ్ముతారు. కుంభమేళాలో పవిత్ర స్నానం చేస్తే మోక్షానికి మార్గమని భావిస్తారు. కుంభమేళాలో భారతదేశానికి చెందిన వారే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు సాధారణంగా ముగిశాయి. సెన్సెక్స్ 81,575 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై, చివరికి 81,510 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 8.95 పాయింట్ల నష్టంతో 24,610 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.85గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 71 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,687 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలలో చలి బాగా పెరిగిందని భారత వాతావరణ శాఖ తెలిపింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, హర్యాణా, యూపీలో చలి తీవ్రత పెరిగింది. పలుచోట్ల దట్టమైన పొగమంచు ఏర్పడింది. ఈరోజు ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 8.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. అలాగే, జమ్మూ కశ్మీర్‌లో గరిష్టంగా 10 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా మైనస్ 2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఇక ఉత్తరప్రదేశ్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు 8 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. దీంతో ప్రజలు చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు.

==========================

==========================